# 18. కుట్ర

మే నెల, ఉదయం పదకొండు గంటల వేళ, ఆకాశంలో సూర్యుడు చండ ప్రచండంగా వెలుగుతున్నాడు.

కాలవగట్టున కొబ్బరిచెట్టు నీడలో ఒక కాలు చాపుకొని కూర్చుని తదేక దీక్షతో చుట్టచుట్టే పనిలో ఉన్నాడు గురువులు. పొగాకు ముక్కని చాపిన తొడమీద పెట్టుకుని సాపు చేస్తున్నాడు. పక్కనే నేలమీద నాలుగైదు కాల్చేసిన చుట్టపీకల్ని విప్పి పోసిన గుండ ఉంది. ఆగుండని ఆకులో పోసి ఒకే చుట్టగా చుట్టాలని అతని ప్రయత్నం.

అతని ముందున్న గోదారి కాలవలో నీళ్లు అంతంతమాత్రంగా ఉన్నాయి. అతని వెనకున్న చేపలచెరువులు పుష్కలంగా నీటితో నిండి ఉన్నాయి. చేపల చెరువుకీ కాలవగట్టుకీ మధ్య మట్టిపోసి ఎత్తుచేసిన నేల మీద కొబ్బరాకుల గుడిసె ఉంది. గుడిసె ముందు వాకిట్లో పొయ్యి మీద చట్టిలో చేపలపులుసు మరుగుతోంది. పక్కనే వార్చిన అన్నంగిన్నె పొయ్యికానించి ఉంది. పొయ్యివేడి తగలనంతదూరంలోకూర్చుని గురువులు పెళ్లాం అర్జమ్మ కొబ్బరిపీచుకొడుతోంది.

కొబ్బరిచెట్టు ఆకులు అభయహస్తాల్ని చాచి వాకిలికి, గుడిసెకి నీడను పంచి ఇస్తున్నాయి. కాలవగట్టుకి రెండువైపులా నాటిన కొబ్బరి చెట్లు ఎదిగి ఈ మధ్యనే కాపుకొచ్చాయి.

ఉన్నట్టుండి వెచ్చటిగాలితెర దూసుకెళ్లింది. అవతలివైపు చెట్టునుంచి పండినబొండాం ఒకటి రాలి కాలవలోపడి బుడుంగున శబ్దమైంది. పొగాకు ముక్కనక్కడ పడేసి పరుగెత్తుకెళ్లి బొండాంతెచ్చి వాకిట్లో పడేసాడు గురువులు. కాయపడినప్పుడల్లా అతనిమొహం ఆనందంతో వెలిగిపోతూంటుంది. ఎప్పుడైనా అరుదుగా దొరికే ఆకాయల్ని దారిన పోయేవాళ్లకి అమ్మి రూపాయో అర్థో సంపాదించి చుట్టలు కొనుక్కుంటాడు.

"సెలాకతెచ్చి బైటెట్టే అర్జీ, బొండం వొలిసేత్తాను" అన్నాడు.

"అంబలితాగివోడికి మీసాలొత్తీవోడొకడేటి, తెచ్చుకో" అంది అర్జి.

"సుట్టముక్క సుట్టుకుంటన్నానుగాదే" చెట్టుకిందకి నడుస్తూ అన్నాడు.

"ఓయ్యోయ్, గంటలు గంటలు కూకుని సుట్టముక్క బాగానే సుడతన్నావ్ గానీ, నువ్వెక్కడ కూకున్నావో గెవనవేవన్నా ఉందా నీకు?"

"ఏం, ఏటైందిక్కడ కూకుంటే? సెరువుకాపలా కాత్తానే ఉన్నానుగదా"

"అది కాదయ్యానేసనీది, అవతలి సెట్టుమీంచి పడినట్టే ఈ సెట్టుమీంచీ బొండం పడొచ్చుకదా, సరిగ్గా సెట్టుకింద కూకున్నావు"

"ఏటామాత్రం నాకు తెల్దనుకున్నావేటి? ఎక్కడైనా పచ్చిబొండాలు ఆటంతటికయ్యి పడిపోతాయేటి? ఈ సెట్టుకి గెలలింకా ముదర్లేదు. సరేగాని పులుసుమరిగిందేటి వొణ్ణం తినేద్దారి"

పొయ్యివేపు చూసింది అర్జి. పొయ్యిలోని కొబ్బరిడొక్కలు సగంమండి ఆరిపోయి పొయ్యి చప్పగా చల్లారిపోయి ఉంది. కింద సన్నని వేడికి పైన నూనె తెట్టుకట్టి అడుగున పులుసు నెమ్మదిగా తెర్లుతోంది.

లేచి డొక్కల్ని పొయ్యిలోకి నెట్టి "పులుసు ఉంకొంచెం మరగాల, ఆసుట్టపనేదో సేసేసుకుని రా, తినేద్దారి. ఇయ్యాల పులుసుబాగా కుదిరినట్టన్పిత్తంది. అబ్బిగాడొత్తే బాగుణ్ణు. ఆడికి ఏడేడి సేపల పులుసంటే ఇష్టం" అంది అర్జి.

"అబ్బిగాడు ఇయ్యాలెందుకొత్తాడే, పరీచ్చలయ్యాదాకా రానన్నాడు గదా!"

"అవున్లే..."

దగ్గర్లో సైకిలుబెల్లువిని తల పైకెత్తి చూసేడు గురువులు. ఊళ్లోమాంసం సాయిబు అల్లుడు సలీం. నిరుడు ఆషాఢంలో పెళ్లైంది. ప్రస్తుతం అతని పెళ్లాం పురుటికి వచ్చి పుట్టింట్లో ఉంది. ఈ కుర్రాడు వారానికొకసారి భార్యను చూడ్డానికి వచ్చి ఒకరోజుండి వెళ్తుంటాడు.

"బాగున్నావా అల్లుడా" నవ్వుతూ పలకరించేడు గురువులు.

సలీం సైకిలాపి "బాగున్నాను మాయ్యా, మాయత్తచేతి చేపలపులుసేటి కాలవలాకుల్దాకా కమ్మగా వోసన కొట్టేస్తంది" అన్నాడు.

ఆమాటకి అర్జమ్మ మురిసిపోయి "ఏటో, అల్లుడు మెచ్చుకోలుకి అంటన్నాడుగాని, మీయత్తవొండీ పులావులు, మాంసం కూరలకన్నానేటి బాబా" అంది.

"లేదత్తా, అప్పుడుకప్పుడు చేపనిపట్టి వొండితే వొచ్చే రుచే ఏరులే" అన్నాడు.

"మరింకేం, రెండుముద్దలు తినేసెల్లు" అంది అర్జి.

"అంతమాటన్నావ్ అదే చాలత్తా! ఉంకోసారెప్పుడన్నా తింటాన్లే, నాకు కొడుకో కూతురోపుట్టినప్పుడు మీరిద్దరూ పలావు తింటానికి రావాల" అన్నాడు సలీం.

అర్జి లేచి వాకిట్లో ఉన్న కొబ్బరిబొండాం తెచ్చి సలీంకిచ్చింది. "పట్టుకెల్లు, మీయావిడికి కొబ్బరన్నం తినాలనుందని మొన్న నేనటుకేసి ఎల్లినప్పుడు సెప్పింది" అంది అర్జి.

"తేంక్సత్తా" బొండాం అందుకుని సైకిలు వెనక కేరేజికి పెట్టుకున్నాడు సలీం.

గురువులు చుట్టచుట్టడం పూర్తిచేసి చెవి వెనక పెట్టుకున్నాడు.

"ఏటల్లుడూ, పాలికొాక కొత్త సైకిలేసుకొత్తన్నావు. సైకిళ్లేపారవేవన్నా ఉందేటిమనకి?" అన్నాడు సలీంసైకిల్ని చూస్తూ.

"ఊరుకో బాతులోడుమాయ్యా, ఏళాకోళం నువ్వూను, సైకిలుషాపు లో అద్దెకి తెచ్చుకునే సైకిలు ఎప్పుడూ ఒకేలాగుంటాదేటి? అంత యాపారవే ఉంటే ఆర్లీసు ఫేక్టరీలో సీజను కూలిపనికి ఎందుకెల్తాను" అన్నాడు సలీం.

"ఓసోస్, నన్ను బాతులోడంటారని నీక్కూడా తెల్సిపోయిందేటబ్బాయా" గురువులు మురిసిపోతూ అడిగేడు.

"ఊళ్లో అందరూ నిన్నలాగే అంటన్నారుకదా! ఎందుకలాగంటన్నారని మా మాయ్యనడిగితే ఆయనగారు వో... నవ్వుకుంటా 'అదేదో ఆయన్నే అడిగితెల్సుకో' అన్నాడు. ఏటిమాయ్యా సంగతి?" అన్నాడు సలీం. "అది సరేగాని ఇంతపొదుపేటిమాయ్యా, అయిపోయన చుట్టముక్కల్నికూడా రుదాగా పోనియ్యవా" అని నవ్వేడుగురువులు చెవిలో చుట్టని చూస్తూ. జేబులోంచి చార్మినార్ సిగరెట్టు పెట్టె తీసి ఒక సిగరెట్టు గురువులుకిచ్చి తనోటి నోట్లో పెట్టుకున్నాడు. అగ్గిపెట్టె కోసం జేబులు వెతుక్కుంటుంటే గురువులు లేచి పొయ్యిలోంచి నిప్పు ఉన్న కొబ్బరి డొక్క ఒకటి తెచ్చి సలీంకిచ్చేడు. సలీం ఇచ్చిన సిగరెట్టుని అపురూపంగా పెదవుల మధ్య ఉంచుకుని అదేనిప్పుతో వెలిగించుకున్నాడు.

"రాజమండ్రి నుంచి ఎండలో సైకిలు తొక్కితొక్కి కాళ్లపీక్కుపోతున్నాయి" అంటూ సలీం సైకిలు స్టేండువేసి వచ్చి కొబ్బరిచెట్టుకి చేరబడి కూర్చున్నాడు.

"బస్సులో వచ్చేకపోయేవా అబ్బాయా" అంది అర్జి పీచుకొట్టడం ఆపుచేసి.

"బస్సైనా లాకులకాడ ఆగిపోద్దికదా, అక్కణ్నుంచి నడుచుకుని రాలేక అడంగు నుంచే సైకిలు మీద వచ్చేస్తన్నానత్తా".

అర్జి లేచి చెంబుతో కొత్తకుండలోని మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది. అందుకుని గడగడా తాగేసి "ఎండ మండిపోతంది. ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరటంలేదు" అన్నాడు సలీం.

"వైశాకమాసం కదా, అలాగే ఉంటాదిమరి" అన్నాడు గురువులు.

"కొబ్బరిచెట్టునీడని గోదారికాలవగాలి చల్లగా ఉండి ప్రేణం లేచొస్తంది. కాసేపు కూసుని ఎల్తానుగాని నీబాతులోడి కతేటో చెప్పుమాయ్యా".

అర్జి ఖాళీచెంబు అందుకుంటూ నవ్వింది "మంచిమాటే అడుగుతున్నావబ్బాయా, మీ మాయ్యకి ఆకబుర్లినీవోళ్లుంటే తిండీతిప్పలూ ఏటీ అక్కర్లేదు" అంది.

"ఎహె, నువ్వూరుకోయే" గురువులు కాలుస్తున్న సిగరెట్టు ఆర్పి రెండో చెవి వెనక పెట్టుకున్నాడు. గొంతు సవరించుకున్నాడు "మాయయ్యకి బాతుల పెంపకం రుత్తి. మాతాత ముత్తాతలకాణ్ణుంచి అదే బతుకు తెరువంట. ఒకటా రెండా, పందలకొద్దీ బాతులు. సిన్నప్పుడుకాణ్ణుంచి నేనూ ఆ బాతుల గుంపుల్లోనే పెరిగేను. ఈ కాలవలమ్మట, లంకలమ్మట మేవు తిరగని సోటుండీది కాదు. ఎక్కడ నీళ్లుంటే అక్కడికి బాతుల్ని తోలుకుంటా అలాగెల్లి పోటవే, ఆటిమద్దిన తిరిగి తిరిగి నాకు బాతుల గురించి అయిదోఏడు కాణ్ణుంచే తెలివిడొచ్చేసింది. ఏబాతు ఎప్పుడు గుడ్డెడతాది, ఎక్కడెడతాది, పగిలిపోకుండా బాతుగుడ్లు ఎలాగ ఏరాల, ఎంతకమ్ముకురావాల అన్నీ నాకు కొట్టినపిండే. ఉంకొక ఇసయం నువ్వు నమ్ముతావోలేదో బాతు నీట్లో ఈదుతున్నప్పుడు గుడ్డెట్టేసిందనుకో, ఆ గుడ్డు మునిగిపోకముందే నేనందుకునేసీవోణ్ణి. ఒకేళ మునిగిపోతే అడుక్కిమునకేసి ఏరుకొచ్చేసీవోణ్ణి. అది సూసినోళ్లందరూ ముద్దుగా 'ఒరే బాతులోడా' అనీవోరు. మాయయ్యైతే 'బాతులపెంపకంలో నీకు తిరుగులేదొరే' అని మురిసిపోయీవోడు"

"గుడ్లమ్మేసుకుంటే మంద ఎలాపెరిగేది?"

"మరి గుడ్లు, బాతులు అమ్ముకోపోతే మాపొట్టెలాగెల్తాది? నీకొక ఇసయం తెల్సా బాతులు పిల్లల్ని పొదగవు. అందుకని మేవు తిరిగీ సోట ఊరూరికీ కోళ్లున్నమ్మలకి వొండుకోటానికి నాలుగు గుడ్లిచ్చి, పిల్లల్ని చేయించమని నాలుగు గుడ్లిచ్చీవోళ్లం, ఆళ్లు కోళ్లమట్టుల్లో ఈ బాతుగుడ్లుకూడా ఎట్టేసి పొదిగించీవోళ్లు, తిరిగొచ్చీటప్పుడు ఆ పిల్లల్ని తీసుకుని మామందల్లో కలుపుకొనీవోళ్లం."

"ఒకళ్లకింద పనిచెయ్యక్కర్లేని సొంతయాపారం, బాగానే ఉండుంటాదికదా, మరి ఎందుకు మానేసేరు?"

"గ్రెహపాటలాగుంది, ఏం సేత్తాం సెప్పు. ఎక్కడ సూసినా సేపల సెరువులు, రెయ్యల సెరువులు మొదలెట్టేసేరు. పెద్ద పెద్ద బూకావందులు పచ్చటిపంటలుపండీ పొలాల్ని కూడా సెరువుల కింద మార్చేసేరు. ఇంకక్కణ్ణించీ మమ్మల్ని దరిదాపుల్లోకి రానిచ్చీవోరు కాదు. బాతులమంద సెరువులో దిగిందంటే సేపపిల్లలన్నిట్నీ సప్పరించేత్తాది. నీళ్లలేని సోట బాతులు బతకవు. మాయయ్యసూత్తే రోజుకోబాతునమ్మేసి మందుతాగేసీరకం. ఇంక

బాతులపెంపకం మీద బతుకులెల్లవని తెలుసుకుని ఈ వూరి పెద్దకావందుగారికాడ నన్ను కవతవెట్టేసేడు. నాలుగేళ్లకింద ఆబాబు సచ్చిపోయినా మాకావందమ్మ మాదొడ్డమనిసి. ఒక్కసేతి మీద ఇన్నిన్ని ఎగసాయాలు, యాపారాలు నడుపుకొత్తంది. ఏదో ఆ యమ్మదయవొల్ల కూటికి లోటు లేకుండా ఇలాగెల్లిపోతంది"

"అవునెల్లిపోతంది, సెర్లోంచి ఒక్కసేపపిల్లనైనా వొండుకోకూడదని ఆడ్డరేసింది తల్లిమాలచ్మి. పొద్దున్న కాలవలో పడి గంటసేపు దేవులాడితేగాని ఒక్కసేపపిల్ల దొరికింది కాదు" అంది అర్జి అందుకుని.

"అదేటది, మన్లాటోళ్లందర్నీ వొండుకు తినమనా అంతంత డబ్బోసి సేపలు పెంచుతున్నారు?" కసిరేడు గురువులు.

"మీకొక కొడుకున్నాడంట, చదువుకుంటన్నాడంట" అన్నాడు సలీం వాళ్ల గొడవ ఆపడానికి.

"అవునల్లుడూ! నాకాడి గురించే బెంగంతాని, సిన్నవొయిసులోనే కవతవెట్టేద్దారే అని ఎన్నో ఇందాల సెప్పేను. మాకావందుగూడా నీకన్నా అయిదో పదో ఎక్కువే ముట్టజెప్తాన్లేరా నీకొడుక్కి అనీవోడు, ఇదిగో ఈ అర్జిది నామాట పడనిచ్చింది కాదు. 'ఉన్నావోడొక్కడు, సదువుకుంటానంటన్నాడు. సదివించి తీరాల' అని ఒంటికాలిమీద నిలబడింది. మనూరి పంతులుగారుకూడా 'ఆడిమీద సరస్వతీదేవి దయుంది. సదువుకోనివ్వాల' అని వంతపాడేడు, సదిహేను తరగతులు సదివేసేక ఉప్పుడాడు కలకటేరు సదువు సదువుతున్నానంటన్నాడు. ఇరవైఏళ్లు దాటిపోయేయి. పెల్లీ పెటాకులూలేవు. గట్టుమీద గుడిసిలో కాపరవుండీవోడు కలకటేరవ్వడం మాటలా, నువ్వే సెప్పల్లుడూ!"

"ఎందుకు అవకూడదు, తప్పకుండా అవుతాడు. మీవోడికి ఆపట్టుదల ఉండబట్టే చదువుతున్నాడు".

"నువ్వూ అలాగే అంటన్నావా? మరి నువ్వెన్ని తరగతులు సదివేవల్లుడూ? చిన్నవొయిసులోనే బిడ్డతండ్రివి కాబోతన్నావు. నీ పొట్టకి నువ్వు సంపాదించుకుంటన్నావు. ఏవొయిసులో ముచ్చట ఆవొయిసులో తీరాలనీకులాగ".

"ముచ్చట్లకేవొచ్చెలే, నాదేదో వానాకాలం చదువు. పదోతరగతితో ఆపేసి పనిలో చేరవలసొచ్చింది. మేం ఆడామొగా కలిసి తొమ్మిది మంది పిల్లలం. అంత సంసారాన్ని ఈదడం మాబాబా ఒక్కడివల్లా కాకపోయింది. అందుకే మొగపిల్లలం ఎక్కడికక్కడ చదువులు చాలించేసి దొరికిన పనిలోనల్లా చేరిపోయేం" సిగరెట్టు దూరంగా విసిరేసి నిట్టూర్చేడు సలీం.

"కాని మాయమ్మగారు, అంటే మాకావందమ్మ ఆవిడ గోరికి తెలీని ఇసయం లేదు. అబ్బో సేలా సదువు సదివే ఉంటాది. ఎప్పుడు సూసినా ఆయమ్మ సేతిలో ఏదో ఒక కతలపుస్తకం ఉంటాది. ఆ యమ్మంటాదీ 'ఒరే బాతులోడా! ఒక పెద్ద కుట్ర జరిగి పోయిందిరా. సదువుల పేరు సెప్పి కూలికి పనోళ్లు దొరక్కుండా కుట్ర జరిగిపోతందని మీకావందు సెప్పేవోడు. అదే జరుగుతుందిప్పుడు. మా పెద్దకులపోళ్లందరం డబ్బుకూడబెట్టి బూవులు కొనాల. మీ సిన్నకులపోళ్లందరూ అందులో పనులు సెయ్యాల, అప్పుడే పంటలు బాగాపండి జనానికి తిండికి లోటు లేకుండా నడుస్తాది. అందరూ సదువుల మీద పడి ఎవడి కులరుత్తినాడు వొదిలేసిన మూలాన్ని దరలు ఇలాగ మండిపోతున్నాయి. కరువొచ్చి పడిపోతంది' అనంటాది" మాట్లాడుతూనే గొప్ప ఆలోచనలో పడిపోయాడు గురువులు. కొడుకుని చదివిస్తూ తప్పుచేస్తున్న భావనేదో అతని ముఖంలోకి చొచ్చుకొచ్చింది.

కావందమ్మ ప్రసక్తి రాగానే చేతిలో పనిముట్టుని కిందపడేసి వింటోంది అర్జి. గురువులు ఆపగానే అందుకుంది – "ఆ... సెప్తాది మీకావందమ్మ సెప్పకేంజేత్తాది! ఎల్లినప్పుడల్లా ఇన్ని పచ్చడిమెతుకులు గిన్నిలో పడేత్తే అదే అమురుతం అనుకుని తోకూపుకొంటా ఇనే నీలాటోళ్లకి అలాటి కబుర్లే సెప్తాది. మాటొరసకి... కులరుత్తి వొదలొద్దని కుమ్మరోళ్లందరూ కుండలు జేసేత్తే కొనేవోళ్లున్నారా ఉప్పుడు? ఆళ్లందరూ ఈబలిసినోళ్లకాడ కూలీ నాలీ సేసుకుని బతకాలిసిందేకదా! అంత తెలిసిందాయి కొడుకులిద్దర్నీ ఎగసాయంలో పెట్టకుండా పెద్ద పెద్ద సదువులు సదివించి అమిరికాకి ఎందుకు పంపించిందంట?"

"నువ్వు నోరుముయ్యే ఎతిమతందానా! పంపిత్తే? ఆరికీ మనకీ సాటేటి? ఆరి పెద్దబ్బాయిగోరు ఆదేశంలో తెల్లటి దేవతలాటి ఇంగిలీసమ్మాయని పెళ్లాడేరు తెలుసా! సొంతపిల్లలెక్కువైతే లోకానికి మేలు సెయ్యలేవని ఒక్కడే పిల్లోణ్ని కని, సీనా దేశంనించి ఒక ఆడపిల్లని తెచ్చుకుని పెంచుతున్నారంట. ఇంక ఆరి సిన్నబ్బాయిగోరు ఇక్కడికొచ్చినప్పుడల్లా గుళ్లకి గోపురాలకి సేతికి ఎముకలేకుండా కర్చుపెడతానే ఉంటారు"

"నాకు తెలకడుగుతాను ఏం, సీనాదేశంలోనే గాని దిక్కులేని ఆడపిల్లలు మనకాడలేరా? ఇంక, గుళ్లకీ గోపురాలకీ పెడితే అది మనుసులుకి మేలు సేసినట్టవుతాదా? ఏం సలీంబాబు నువ్వుసెప్పు" అంది అర్జి. అర్జమ్మలాజిక్కుని ఆశ్చర్యపోయి వింటున్న సలీం "బలేగా చెప్పేవత్తా" అన్నాడు. "అవును మాయ్యా, నీకోటి చెప్పనా, కులాలేటి మతాలేటి గాని ఎవడు లోకువగా ఉంటే ఆణ్ణిమొత్తుతాది లోకం. చదువుకుని తెలివితేటలు సంపాదించుకున్న కిందికులాలోళ్లు ఆళ్లతలకిమించి పోతారేమోనని మీకావందమ్మకి బాదకాబోలు. నీకొడుకు చదువుకోకుండా ఉంటే నీకులాగా మరోకూలోడు చవకగా ఆళ్లకి

దొరికి ఉండేవోడు కదా!" అన్నాడు. "సరే, మావోళ్లు నాకోసం ఎదురు చూస్తా ఉంటారు. నేనింక బయలుదేరతాను, అన్నాలు తినండి" సలీం లేచి సైకిలు తీసుకున్నాడు.

నాలుగడుగులెళ్లేక గుర్తుకొచ్చినట్టు వెనక్కి చెయ్యి ఊపుతూ "పట్టుదలుంటే కాలవగట్టు గుడిసెలో ఉండేవోడుకూడా కలెక్టరౌతాడు. మంచి కుట్రే జరిగిందని మీకావందమ్మకి చెప్పు మావయ్యా" అనరిచేడు సలీం నవ్వుతూ.

మధ్యాహ్నం ఎండకి చెట్లమీద సేదతీరుతున్న నాలుగైదు కాకులు అరుస్తూ గాలిలోకి లేచాయి.

గురువులు బుర్రగోక్కుంటూ సలీం వెళ్లిన వైపే చూస్తున్నాడు. సలీం సైకిలు దూరంగా కన్పిస్తున్న ఊరివైపు దూసుకుపోతోంది. ఆకాశంలో సూర్యుడు జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్నాడు.

"ఇంక రా, వొణ్ణం తిందూగాని" అని గుడిసెలోంచి కేకేసింది అర్జమ్మ.

*(ATA సావనీరు 2012)*